సాక్షి
ములుగు
శనివారం । 23 । ఆగస్టు । 2025



దర్గా ఉత్సవాలు షురూ..
శుక్రవారం తెల్లవారుజామున సందల్ ముగియడంతో కాజీపేట బియాబానీ దర్గా ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.
- 8లో▸



ఉమ్మడి వరంగల్‌కు భారీగా నిధులు - 8లో▸
మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీగా నిధులు కేటాయించింది.

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

వాతావరణం
ఉదయం నుంచి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్న సమయంలో ఎండ ఉంటుంది. పలుచోట్ల రాత్రి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

ఇంటర్ విద్యార్థులకూ ఎఫ్‌ఆర్‌ఎస్

నేటినుంచే అమలు.. రిజిస్ట్రేషన్ షురూ

రోజుకు రెండుసార్లు హాజరు నమోదు ● గైర్హాజరైతే తల్లిదండ్రుల ఫోన్లకు సమాచారం
ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

విద్యారణ్యపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంపునకు (శనివారం) నుంచి ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) (ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు)ను అమలు చేయనున్నారు. ఇందుకోసం ఇంటర్ బోర్డు అధికారులు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సాంకేతిక సహకారంతో టీజీబీఐఈ – ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్రతీరోజు రెండు సార్లు (ఉదయం, మధ్యాహ్న భోజనం తర్వాత) హాజరు తీసుకుంటారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. కళాశాలకు ఏ విద్యార్థి అయినా హాజరుకాకుంటే అతడి తల్లిదండ్రుల ఫోన్‌కు సందేశం వెళ్తుంది. ఈ హాజరును ఆ కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈఓ, రాష్ట్ర అధికారులు కూడా పర్యవేక్షిస్తారు. ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుపై గత గురువారం ఆయా జిల్లాల్లో డీఐఈఓలు.. కాలేజీ ప్రిన్సిపాళ్లతో సమావేశాలు నిర్వహించి హాజరు అమలు విధానాన్ని తెలియజేశారు. హనుమకొండ, వరంగల్‌లో డీఐఈఓలు ఎ.గోపాల్, శ్రీధర్‌సుమన్ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు.



యాప్ డౌన్‌లోడ్ విధానం తన మొబైల్ ద్వారా చూపిస్తున్న వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్

జిల్లాల వారీగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	కళాశాలలు	ఫస్టియర్	సెకండియర్
హనుమకొండ	09	2,900	2,013
వరంగల్	11	1,272	1,000
మానుకోట	10	1,350	1,200
ములుగు	08	734	821
భూపాలపల్లి	05	520	535
జనగామ	07	1,050	950



విద్యార్థులకు రోజుకు రెండు సార్లు హాజరు

● అధ్యాపకులు గూగుల్ ప్లేస్టోర్ నుంచి టీజీబీఐ ఈ –ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులో విద్యార్థుల ఫొటోతో సహా వివరాలు నమోదు చేయాలి. ● తరగతి ప్రారంభమయ్యాక స్మార్ట్ ఫోన్‌లో ఆ యాప్ ద్వారా కెమెరా ఓపెన్ చేసి వీడియా మాదిరిగా కూర్చున్న విద్యార్థులను తీసుకుంటూ వెళ్తే ఆటోమేటిక్‌గా ఫొటో క్యాప్చర్ అయి హాజరు నమోదవుతుంది. ● ఈ విధానంతో 15నుంచి 20 సెకన్లలోనే 80మంది విద్యార్థుల వరకు హాజరు నమోదు చేయవచ్చని చెబుతున్నారు. ● ముఖ హాజరుకు శుక్రవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఇంకా చేపట్టనివారు ఉంటే ఈనెల 23న చేపడతారు. ● కళాశాలల సమయం ఉదయం 9:30 గంటల నుంచి ప్రతీ తరగతి గదిలోని తొలి పీరియడ్ తీసుకునే అధ్యాపకుడు విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేస్తారు. ● మళ్లీ మధ్యాహ్నం లంచ్ తర్వాత 2గంటలకు మరోసారి నమోదు చేస్తారు.

ప్రతీ జిల్లాకు ఇద్దరికి ఏఐ చాంపియన్లుగా శిక్షణ

ఇంటర్ విద్యలో కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర బోర్డు నిర్ణయించింది. విద్యలో నాణ్యత పెంపు, విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి, సరికొత్త సాంకేతికత పరిచయం కోసం ఏఐని వినియోగించుకోనున్నారు. దీనిపై పట్టున్న సిబ్బందిని గుర్తించి ఏఐ చాంపియన్లుగా ఎంపిక చేసింది. ప్రతీ జిల్లాలోని అకడమిక్ మానిటరింగ్ సెల్‌లోని ఇద్దరు లెక్చరర్లు, ఒక లైబ్రేరియన్, ప్రతీ జిల్లాకు ఏఐ చాంపియన్లుగా ఎంపికైన ఒక లెక్చరర్, నాన్‌టీచింగ్ సిబ్బందికి శుక్రవారం హైదరాబాద్‌లో సంబంధిత ఉన్నతాధికారులు ఏఐ ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు, వినియోగంపై శిక్షణ ఇచ్చారు.



ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుపై ప్రిన్సిపాళ్లకు సూచనలిస్తున్న హనుమకొండ డీఐఈఓ గోపాల్

ఇంటర్‌లో హాజరుశాతాన్ని పెంచేందుకే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు తక్కువగానే ఉంటోంది. ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థుల్లో మధ్యాహ్నం భోజనం కోసం కొందరు ఇంటికి వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. తిరిగి రావడం లేదు. ఇంటివద్ద కాలేజీకి అని చెప్పి డుమ్మా కొట్టే పిల్లలు కూడా ఉన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత తక్కువగా రావడానికి కూడా విద్యార్థులు తరగతులకు సరిగా హాజరుకాకపోవడమే అనేది ఇంటర్‌బోర్డు అధికారులు భావిస్తున్నారు. ఆయా సమస్యలకు పరిష్కారంగానే ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలు చేస్తున్నారన్నది స్పష్టమవుతోంది.

న్యూస్‌రీల్

అత్యవసర సేవలపై తక్షణమే స్పందించాలి



మంగపేట: అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు సమాచారం అందిన తక్షణమే స్పందించాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీర్ 108, 102 సిబ్బందికి సూచించారు. మండలంలోని మంగపేట, చుంచుపల్లి, 108, 102 అంబులెన్సులను ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స కోసం అందించే మందులు, పరికరాలు అన్నీ అందుబాటులో ఉన్నాయో.. లేదో.. తెలుసుకుని కాలం చెల్లిన మందులను ఉంచుకోవద్దని సూచించారు. ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత పరికరాలు, మందులు పనిచేసేలా చూసుకోవాలన్నారు. అనంతరం వాహనాల పనితీరు, సిబ్బంది హాజరు, మందుల వివరాల రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అత్యవసర వాహనాల కార్యనిర్వాహణ అధికారి రాజ్‌కుమార్, ఎడ్ల నరేష్, లోహిత, మంజుల, పైలెట్లు రాజేశ్వర్, భాస్కర్, రాజేష్, విగ్నేష్ ఉన్నారు.

మలేరియా, డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



ములుగురూరల్: మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపారావు అన్నారు. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో డెంగీ నిర్ధారణ కావడంతో శుక్రవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిల్వనీటిని తొలగించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టి డెంగీ, మలేరియా వ్యాప్తిని అరికట్టాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కీటక జనితనియంత్రణ అధికారి చంద్రకాంత్, వైద్యాధికారి ప్రసాద్, ఏఎంఓ దర్గరావు, సబ్ యూనిట్ అఫీసర్ సాంబయ్య, తదితరులు ఉన్నారు.



మరింత కిక్కు

భారీగా పెరిగిన మద్యం టెండర్ల రుసుం

● జిల్లాలో మొత్తం 25 మద్యం షాపులు
● గతంలో 874 దరఖాస్తులు
● స్లాబ్‌ల వారీగా ఫీజు చెల్లింపు

వెంకటాపురం(ఎం): స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నూతన మద్యం పాలసీకి ముందుగానే టెండర్లు ఆహ్వానించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ప్రస్తుత దుకాణాల లైసెన్స్ కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ 30తో ముగియనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా 2025 మద్యం టెండర్ విధానాన్ని ప్రకటించింది. 2025 నుంచి 2027 వరకు రెండేళ్ల కాలపరిమితికి టెండర్ ఫీజు ఖరారు చేసింది. ఈ సారి మద్యం దుకాణం టెండర్ ఫాం ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్ ఫీజు మాత్రమే పెంచిన ప్రభుత్వం.. మిగతా విధానాలు పాత పద్ధతుల్లోనే కొనసాగించేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో 10 మండలాల పరిధిలో 25 మద్యం దుకాణాలు ఉన్నాయి. ములుగు సర్కిల్ పరిధిలో 16, ఏటూరునాగారం సర్కిల్ పరిధిలో 9 మద్యం దుకాణాలు ఉన్నాయి. గతంలో జిల్లాలోని 25 షాపులకు గాను 874 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారా రూ.17.48 కోట్ల ఆదాయం అదనంగా సమకూరింది.

రిజర్వేషన్ల ప్రకారం..

మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈసారి రిజర్వేషన్లు 30 శాతంగా నిర్ణయించారు. గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ఈ రిజర్వేషన్ల ఆధారంగా మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. అయితే ఆయా దుకాణాలకు జనాభా ప్రాతిపదికన రెండేళ్ల కాలానికిగాను నాలుగు నెలలకోసారి ఆరు స్లాబ్‌లలో లైసెన్స్‌దారులు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

నవంబర్‌తో ముగియనున్న గడువు

ప్రస్తుత మద్యం దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎన్నికల సంఘం కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమై ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మద్యం షాపుల టెండర్లకు వీలుండదనే ఆలోచనతో ప్రభుత్వం ముందస్తుగా నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న మద్యం పాలసీ విధానాన్నే అమలు చేయనుంది. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు రెండేళ్ల కాలానికి మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. గతంలో ఉన్న దరఖాస్తు ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచారు. ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

లాటరీ పద్ధతిన ఎంపిక..

మద్యం దుకాణాలను గతంలో మాదిరిగానే ఈ సారి కూడా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు తీసుకుని పరిశీలిస్తారు. అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారించిన దరఖాస్తులను ఫైనల్ చేస్తారు. ఆయా మద్యం దుకాణాల వారీగా నంబర్లతో డబ్బాల్లో వేసి దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీస్తారు.

వైన్స్‌కు స్లాబ్‌ల వారీగా చెల్లించాల్సిన ఫీజు

5 వేల జనాభా లోపు	రూ.50 లక్షలు
5 వేల నుంచి 50వేల జనాభాకు	రూ.55 లక్షలు
50 వేల నుంచి లక్ష జనాభాకు	రూ.60లక్షలు
లక్ష నుంచి 5 లక్షల వరకు	రూ.65 లక్షలు
5 లక్షల నుంచి 20 లక్షల జనాభాకు	రూ.85 లక్షలు
20 లక్షలకు పైగా జనాభాకు	రూ.1.10కోట్లు

తగ్గు ముఖంపట్టిన గోదావరి



పేరూరు వద్ద బ్రిడ్జి

బయట పడ్డ రహదారులు

వాజేడు: గత మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. వేగంగా పెరిగిన గోదావరి వరద అదే వేగంతో తగ్గుతోంది. మండలంలోని పలు గ్రామాల మధ్య కొనసాగిన వరద తగ్గిపోవడంతో ముంపునకు గురైన రహదారులు బయట పడ్డాయి. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. టేకులగూడెం గ్రామం వద్ద ముంపునకు గురైన జాతీయ రహదారి కూడా బయటపడడంతో రెండు రాష్ట్రాల మధ్యన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.



జాతీయ రహదారిపై వరద తగ్గడంతో వెళ్తున్న వాహనం

గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. ఈనెల 27 నుంచి తొమ్మిది రోజు పాటు నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ముందస్తు ముందస్తు చర్యల్లో భాగంగా ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లోని గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీ సభ్యులు, ఆలయ చైర్మన్‌లతో ఏఎస్పీ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ప్రతీ ఒకరు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రతి మండపంలో సీసీటీవీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని, మండల పాల దగ్గర విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రతీరోజు రాత్రి ఇద్దరు మండపాల దగ్గర విధిగా ఉండాలన్నారు. గణేష్ విగ్రహ నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రోడ్డుపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను వెంటనే తొలగించాలని తెలిపారు. విద్యుత్ తీగలను సరిచేసే విధంగా విద్యుత్‌శాఖ వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. భక్తి శ్రద్ధలతో నిమజ్జనం ఊరేగింపు జరుపుకునేందుకు అన్ని కమిటీల సభ్యులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. నిమజ్జనం కోసం ముళ్లకట్ట వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, ట్రెయినీ ఎస్సైలు నరేష్, రచిత్ర రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, సాయిబాబా కమిటీ చైర్మన్ ప్రభా కర్, హనుమాన్ అర్చకులు యల్లాప్రగడ సూర్యనారాయణశర్మ, గణపతి కమిటీ సభ్యులు, మజీద్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, సర్కార్, అజ్మత్‌ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

కంకవనాల నర్సరీకి సన్నాహాలు

ఐటీడీఏ స్థలాలను పరిశీలించిన అధికారులు

ఏటూరునాగారం: జిల్లాలోని అన్ని వర్గాల రైతులకు కంకవనాలను పెంచేందుకు అనువైన స్థలాలను పరిశీలించినట్లు అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ సంపత్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ ఏటూరునాగారం నర్సరీని ఏపీఓ వసంతరావుతో కలిసి సంపత్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఇందస్ట్రీ ఎస్‌జీఓ ద్వారా పది లక్షల కంకవనం మొక్కలను పెంచడానికి అనువైన స్థలం కోసం ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్లు వారు తెలిపారు. ఈ మొక్కలను ఇక్కడ పెంచి చుట్టూ పక్కల మండలాల్లోని రైతులకు ఈజీఎస్ ద్వారా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కంకవనాలను పెంచి వాటిని మార్కెటింగ్ చేసే వెసులుబాటు కూడా కల్పిస్తోందన్నారు. జిల్లాలోని ఆసక్తిగల వ్యక్తులకు కంకవనంతో వస్తువుల తయారీపై శిక్షణ ఇప్పించడానికి ట్రైనర్లను పిలిపిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటిన అధికారులు

ప్రతీ ఒక్కరు మొక్కలను పెంచాలని అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు, ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. పనుల జాతరలో భాగంగా ఐటీడీఏ నర్సరీ వద్ద వారు మొక్కలను నాటారు. ఉపాధి హామీలో భాగంగా ప్రతీ ఒక్కరికి మొక్కలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వ్యక్తులు ఈజీఎస్, జీపీ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ రాజ్‌కుమార్, ఎస్‌ఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కుమార్, ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కనాటి నీరుపోస్తున్న అధికారులు

అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలి

జయలక్ష్మి

గోవిందరావుపేట: అంగన్‌వాడీలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. పస్రా పీఎస్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ములుగు జిల్లా మహాసభలను సరోజన, రుద్రమదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయలక్ష్మి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఐసీడీఎస్‌తోపాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం తెచ్చిందని అన్నారు. ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ సిఫార్సులను అమలు చేస్తుందని, ఐసీడీఎస్‌ను నిర్వీర్యపరచడానికి నిర్ణయం చేయడం దుర్మార్గమని అన్నారు. విద్యాబోధన బాధ్యతలను అంగన్‌వాడీ టీచర్స్‌కు, హెల్పర్లకు ఇవ్వాలని, వలంటీర్లకిచ్చే అదనపు వేతనం అంగన్‌వాడీ టీచర్లకి ఇవ్వాలని అన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఎండీ దావుద్, కొప్పుల రఘుపతి, సోమా మల్లారెడ్డి, గొంది రాజేష్, సమ్మక్క, పద్మారాణి, భాగ్యలక్ష్మి, పార్వతి, సూరమ్మ, సరిత, రమ, రుక్మిణి, ధనలక్ష్మి, మోక్షరాణి, దీప, వెంకటరమణ, విజయలక్ష్మి, మల్లికార్జున, శోభ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

నిర్లక్ష్యం వహిస్తే ఇంటికే..

ఉద్యోగులకు కలెక్టర్ దివాకర హెచ్చరిక

మంగపేట : పాఠశాలల నిర్వహణ, విద్యాబోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇంటికి వెళతారని కలెక్టర్ టీఎస్ దివాకర మంగపేట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులను శుక్రవారం ఘాటుగా హెచ్చరించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమికోన్నత పాఠశాల, పీహెచ్‌సీని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూపీఎస్ ఉపాధ్యాయులు విద్యాబోధన సక్రమంగా చేయడంలేదని, పాఠశాల నిర్వహణ, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో నెలరోజుల్లో పద్ధతి మార్చుకోవాలని లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జెడ్పీ హెచ్‌ఎస్, యూపీఎస్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతీ రోజు భోజనం అందిస్తున్నారా రుచిగా ఉంటుందా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారంలో ఎన్ని రోజులు గ్రుడ్లు ఇస్తున్నారని అడగడంతో సరైన సమాధానం రాకపోవడంతో విద్యార్థులను ఇంగ్లిష్‌లో వారాలు స్పెల్లింగ్‌తో చెప్పమని అడగడంతో ఒక్కరుకూడా చెప్పకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి చెందారు. విద్యార్థులకు ఏం బోధిస్తున్నారు. అసలు ఏమి జరుగుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎంత, ఎందరు ఉపాధ్యాయులు ఉన్నారని విధులకు ఎంతమంది హాజరయ్యారని ఆరా తీశారు. విద్యార్థుల్లో కనీస పురోగతి కనిపించడం లేదని, విద్యార్థులకు హోంవర్క్ ఏమి ఇస్తున్నారని వాటిని చూపించాలని ఆదేశించారు. అయినప్పటికీ వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఉపాధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం ములకాల వెంకటస్వామి, ఉపాధ్యాయుడు సెలవు పెట్టారని ఎంఈఓ, జెడ్పీ హెచ్‌ఎస్ మేనక కలెక్టర్‌కు తెలిపారు. పాఠశాల నిర్వహణపై మీ పర్యవేక్షణ సక్రమంగా లేదని ఎంఈఓను సున్నితంగా హెచ్చరించారు. పాఠశాల రికార్డులు కూడా సక్రమంగా లేవని, నాలుగో తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేయలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల తర్వాత సందర్శిస్తానని అప్పటి వరకు పాఠశాల నిర్వహణ, రికార్డులు సక్రమంగా ఉండాలని, విద్యార్థులల్లో మార్పు తీసుకురావాలని తెలిపారు.



మంగపేట జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

పీహెచ్‌సీలో తనిఖీ

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ నిర్వహణ, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రోజువారీగా ఓపీ వివరాలు, డెంగీ, మలేరియా జ్వరాల నమోదు వివరాలను వైద్యాధికారి స్వప్నితను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నవారితో మాట్లాడారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఉన్నారు.

పనుల జాతర ప్రారంభం

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని కూలీలందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ దివాకర అన్నారు. ఉపాధి హామీ అభివృద్ధి పనుల జాతర కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి శుక్రవారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దివాకర మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మొత్తం 266 పనులు చేపట్టామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు రోజుకు రూ.307 లబ్ధి పొందాలన్నారు. పనుల్లో భాగంగా చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులకు క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి సంరక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం కొంతమంది ఉపాధి, పారిశుద్ధ్య కార్మికులు దివ్యాంగులు కలిసి కలెక్టర్‌ను సన్మానించారు. ఇదిలా ఉండగా. ఎక్కువ పనులు చేసిన హసీనాబేగం, అస్మత్, సరస్వతి, మల్టీపర్పస్ వర్కర్ మేకల కిష్టయ్యను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కుమార్, ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్ ఉన్నారు.



అత్యధిక పనులు చేసిన వారిని సన్మానించి మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

క్లుప్తంగా

దూరవిద్య డిగ్రీ పరీక్షలు ప్రారంభం

● 8 మంది విద్యార్థులు డీబార్



ఆర్ట్స్ కాలేజీ కేంద్రంలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థులకు ఇయర్‌వైజ్‌స్కీం (ఎక్స్, రెగ్యులర్) పరీక్షలు శుక్రవారం 14 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. వరంగల్ ఏఎస్ఎం, ఎల్‌బీ కాలేజీ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడిన విద్యార్థులను డీబార్ చేసినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ తెలిపారు. ఏఎస్ఎం కాలేజీలో ఒకరు, ఎల్‌బీకాలేజీ కేంద్రంలో ఏడుగురు డీబార్ అయ్యారని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీ కేంద్రాన్ని పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.

అంతర్జాతీయ జూడో రెఫరీగా నాగరాజు



సర్టిఫికెట్‌తో నాగరాజు

మడికొండ: హనుమకొండ జిల్లా మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల జూడో కోచ్ నాగరాజు అంతర్జాతీయ జూడో రెఫరీగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఇంటర్నేషనల్ జూడో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జోర్డాన్ రాజధానిలో జూడో రెఫరీ పరీక్షలు జరిగాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోని హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన నాగరాజు ఒక్కరే ఉత్తీర్ణత సాధించారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొదటిసారి అంతర్జాతీయ జూడో రెఫరీగా ఎంపికైన నాగరాజును ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి అభినందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మడికొండ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల కార్యదర్శి అలుగ వర్షిణి, మల్టీజోనల్ ఆఫీసర్ అలివేలు, విద్యారాణి ప్రోత్సాహంతోనే ఈవిజయం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది నాగరాజును అభినందించి సన్మానించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బొందయ్య (ఫైల్)

కేసముద్రం : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇంటికన్నెలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంధసిరి బొందయ్య (56) సుమారు రూ.5లక్షలకు పైగా అప్పు చేసి ఎకరంన్నర భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. మూడేళ్లుగా పంట దిగుబడి రాకపోవడంతో కొంత కాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడుకి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

వర్షపాతం.. సాధారణం

● వరంగల్ జిల్లాలో అత్యధికం
● మిగతా జిల్లాల్లో సాధారణం
● ఊపందుకున్న పంటల సాగు

హన్మకొండ: ఇటీవల కురిసిన వర్షం ఉమ్మడి వరంగల్ జిల్లాలో లోటు పూడ్చింది. అప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో లోటు, సాధారణ వర్షపాతం ఉండగా ఇటీవలి అల్పపీడనం, వాయుగుండంతో వరంగల్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా జనగామ, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో సాధారణంగా నమోదైంది. జూలై 21 నుంచి 24వ తేదీ వరకు వరుసగా ఆరు రోజులు వర్షాలు కురిసినా సాధారణాన్ని మించలేదు. కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. ఇదిలా ఉండగా ఈ నెల 8 నుంచి 19 వరకు కురిసిన భారీ వర్షాలు లోటు పూడ్చడంతోపాటు సాధారణ వర్షపాతం నమోదైంది. ఆయా జిల్లాలో కొన్ని మండలాల్లో భారీ వర్షం కురవగా, మరికొన్నింటిలో తేలికపాటి నుంచి మోస్తరు కురిసింది. దీంతో జిల్లా సగటు సాధారణ వర్షపాతంగా నమోదైంది.

వ్యవసాయ పనులు ముమ్మరం..

ఈ వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా వరి నాట్లు ఊపందుకున్నాయి. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లోకి నీరు చేరగా, సాధారణంగా కురిసిన ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. ఈ నెల 21 వరకు ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురిసినా సాధారణాన్ని మించలేదు. వర్షాకాలంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 843.4 మిల్లీ మీటర్లుగా కాగా ఇప్పటి వరకు 912 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో లోటుగా ఉంది. ఏటూరుగానాగారం, వెంకటాపురం, మంగపేట మల్లంపల్లి మండలాల్లో సాధారణానికి మించి కురిసింది. మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 681.5 మి.మీ కాగా ఇప్పటి వరకు 651.9 మి.మీ కురిసింది. మహదేవ్‌పూర్, కాటారం మండలాల్లో లోటు వర్షపాతం, మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 567.9 మి.మీ కాగా ఇప్పటి వరకు 663 మి.మీ నమోదైంది. గూడూరు, కేసముద్రం, మరిపెడ, పెద్దవంగర మండలాల్లో సాధారణానికి మించి (ఎక్సెస్) కురిసింది. మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది. జనగామ జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 448.6 మి.మీ కాగా ఇప్పటి వరకు 499.5 మి.మీ మాత్రమే కురిసింది. స్టేషన్ ఘనపూర్‌లో లోటు వర్షపాతం ఉండగా నర్మెట, జనగామ, లింగాలఘణపురం, దేవరుప్పుల, కొడకండ్లలో ఎక్సెస్ వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది. హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు 567.2 మి.మీ సాధారణ వర్షపాతం కాగా ఇప్పటి వరకు 569.1 మి.మీ కురిసింది. భీమదేవరపల్లి, వేలేరు మండలాల్లో ఎక్సెస్ వర్షం కురిసింది. ఎల్కతుర్తి మండలంలో లోటు వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో సాధారణంగా కురిసింది. వరంగల్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 602.6 మి.మీ కాగా ఇప్పటి వరకు 756.9 మిల్లీమీటర్లు కురిసింది. వర్ధన్నపేటలో అతి అత్యధిక వర్షపాతం నమోదు కాగా, గీసుకొండ, దుగ్గొండి, ఖానాపురం, చెన్నారావుపేట, సంగెం, పర్వతగిరి, నెక్కొండ మండలాల్లో అత్యధికంగా కురిసింది. నల్లబెల్లి, నర్సంపేట, రాయపర్తి, ఖిలా వరంగల్, వరంగల్ మండలాల్లో సాధారణంగా కురిసింది.

పంటల సాగు ముమ్మరం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటల సాగు ముమ్మరమైంది. సాధారణాన్ని మించి పంటల సాగైంది.

➤ వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి సాధారణ సాగు 2,84,375 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,05,777 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,40,068 ఎకరాల్లో సాగైంది.

➤ హనుమకొండ జిల్లాలో ..

హనుమకొండ జిల్లాలో సాధారణ సాగు మొత్తం 2,43,357 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,28,406 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,95,902 ఎకరాల్లో సాగైంది.

➤ మహబూబాబాద్ జిల్లాలో..

మహబూబాబాద్ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 3,52,531 కాగా ఇప్పటి వరకు 2,31,294 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 3,39,982 ఎకరాల్లో సాగైంది.

➤ ములుగు జిల్లాలో..

ములుగు జిల్లాలో అన్ని పంటలు కలిపి మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,26,973 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,24,051 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 86,653 ఎకరాల్లో సాగైంది.

➤ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 2,12,415 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,34,195 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 1,92,244 ఎకరాల్లో సాగు చేశారు.

➤ జనగామ జిల్లాలో..

జనగామ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 3,63,104 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3,06,732 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 2,67,111 ఎకరాల్లో సాగు చేశారు.

అన్ని పంటలు కలిపి సాధారణ సాగు విస్తీర్ణం ఇలా..

అన్ని పంటలు కలిపి సాధారణ సాగు విస్తీర్ణంతో ఇప్పటి వరకు సాగైనా విస్తీర్ణం చూస్తే వరంగల్ జిల్లాలో 84.42 శాతం, హనుమకొండ జిల్లాలో 80.50, మహబూబాబాద్ జిల్లాలో 96.44, ములుగు జిల్లాలో 68.25, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 90.50 శాతం, జనగామ జిల్లాలో 73.56 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధాన పంటల సాగు ఇలా..

ప్రధాన పంటలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 8,78,376 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 5,10,100 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 6,89,635 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం మొత్తం 64,906 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 63,375 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 95,979 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి మొత్తం సాధారణ విస్తీర్ణం 5,79,863 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 5,91,372 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 5,00,412 ఎకరాల్లో సాగైంది.

పూలు అమ్మబోయి విగతజీవిగా మారి..

● డ్రెయినేజీలో పడి హమాలీ మృతి
● దేవరుప్పులలో ఘటన



వీరయ్య (ఫైల్)

దేవరుప్పుల : ఓ హమాలీ బోనాల పండుగ సందర్భంగా పూలు అమ్మబోయి విగతజీవిగా మారాడు. డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. ఈ ఘటన దేవరుప్పులలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిట్టబోయిన వీరయ్య(55) హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన ఇద్దరు కూతుళ్లు పూలు, పండ్ల వ్యాపారం చేస్తుండగా వారికి చేదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా సాయంత్రం సైకిల్‌పై పూలు అమ్మడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ఎస్సీ కాలనీలోని డ్రెయినేజీలో పడి ఊపిరాడక మృతి చెందాడు. రాత్రి అయినా వీరయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులకు అనుమానం వచ్చింది. శుక్రవారం వెతుకుతున్న క్రమంలో వీరయ్య డ్రెయినేజీలో పడిపోయిన విషయం తెలిసింది. వెంటనే వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

92 దస్తావేజులకు ఈ-సైన్ రిజిస్ట్రేషన్

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పైలట్ ప్రాజెక్టులో ఎంపిక చేయగా గురువారం ఈ-సైన్ రిజిస్ట్రేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. రెండో రోజు శుక్రవారం కాజీపేట వంద ఫీట్ల రోడ్డులోని వరంగల్ ఆర్వో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లు రామ నరసింహరావు,ఆనంద్ 92 దస్తావేజులకు ఈ-సైన్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. కాగా, సర్వర్ సమస్యతో రాత్రి 8 గంటల వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి.

ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

● అడిషనల్ డిప్యూటీ కమిషనర్ రవి

విద్యారణ్యపురి: విద్యార్థినులు ఆధునిక సాంకేతికతను కూడా వినియోగించుకోవాలని, భవిష్యత్‌లో ఆర్థికస్వావలంబన సాధించే దిశగా చదువుకోవాలని వరంగల్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు గ్రహీత ఎన్.రవి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కాలేజీలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కెమికల్ అండ్ అలైడ్ సైన్సెస్ రీసెర్చ్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది ఈ సదస్సులోఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలోనే లక్ష్యంతో ముందుకెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సీనియర్ ప్రొఫెసర్ లలితాగురుప్రసాద్ కీలకపోన్యాసం చేస్తూ రసాయన శాస్త్ర అనుబంధ శాస్త్ర పరిశోధనల్లో ఆధునిక సాంకేతికత కృత్రిమ మేధా.. సాంకేతికతలో వస్తున్న ఆధునిక పోకడల విశిష్టతను తెలియజేస్తుందన్నారు. సదస్సులో ఆ కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి, కేయూ సైన్స్‌విభాగాల డీన్ జి. హనుమంతు, కెమిస్ట్రీ విభాగం అధిపతి ఎన్.వాసుదేవరెడ్డి, కేయూ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్లు సి.హెచ్. సంజీవరెడ్డి, వడ్డె రవీందర్ మాట్లాడారు. ఈ సదస్సులో సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. సుహాసిని, జాతీయ సదస్సు కన్వీనర్ ఎం.ప్రశాంతి, అధ్యాపకులు సురేశ్‌బాబు, ఉదయశ్రీ, బాలరాజు,జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 23న జాతీయసదస్సు ముగియనుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీగా నిధులు..

● పీఆర్ శాఖకు రూ.23.50 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



హన్మకొండ: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చొరవతో తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్(పీఆర్) శాఖ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీగా నిధులు కేటాయించింది. శుక్రవారం రూ.23.50 కోట్లు కేటాయించి విడుదల చేసింది. ఈ నిధులతో ఇంటిగ్రేడ్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల భవనాలు నిర్మించనున్నారు. ములుగు జిల్లాలో ఎస్ఈ కార్యాలయం నిర్మాణానికి రూ.1.50 కోట్లు, వరంగల్ జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.8 కోట్లు, మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల భవనానికి రూ.2 కోట్లు, ములుగులో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం పరిపాలన మంజూరు చేసింది. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల, భూపాలపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం, హనుమకొండ జిల్లా వేలేరు, దామెర మండల ప్రజా పరిషత్ కార్యాలయం నిర్మాణం, ములుగు జిల్లా మల్లంపల్లి ఎంపీపీ కార్యాలయం, ములుగు జిల్లా ఏటూరునాగారంలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో ఎంపీడీఓ కార్యాలయం నిర్మాణానికి రూ.1.50 కోట్ల చొప్పున కేటాయిస్తూ నిధులు మంజూరు చేసింది.

దర్గా ఉత్సవాలు షురూ..

భక్తులతో కిక్కిరిసిన కాజీపేట బియాబానీ దర్గా





ప్రార్థనలు చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, సీపీ సన్‌ప్రీత్

● లక్షమందికిపైగా సందర్శన..
● చాదర్‌లు సమర్పించి మొక్కులు..

కాజీపేట: కాజీపేట బియాబానీ దర్గా ఉత్సవాలు షురూ అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున సందల్ ముగియడంతో ఉర్సు లాంఛనంగా ప్రారంభమైంది. భక్తులతో దర్గా కాజీపేట పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోతున్నాయి. కులమతాలతీతంగా తరలొచ్చి దర్గాను దర్శించుకుని పూలు, చాదర్‌లు సమర్పించి మొక్కులు సమర్పించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించకపోవడంతో భక్తులు ప్రైవేట్ వాహనాల్లో ఇబ్బందులు పడుతూ దర్గా చేరుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి దాదాపు లక్షమందికిపైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారని నిర్వాహకుల అంచనా. దేశంలోని 25 దర్గాల మత పెద్దలు బియాబానీ దర్గాను సందర్శించి పీఠాధిపతి ఖుస్రూపాషాను ఆశీర్వదించారు.

దర్గాను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు..

బియాబానీ దర్గాను ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ తదితరులు దర్శించుకున్నారు.

పెన్షన్, జీపీఎఫ్‌పై అవగాహన ఉండాలి

● కలెక్టర్ స్నేహాశబరీష్



పెన్షన్ చెల్లింపు ఆర్డర్ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్ : విరమణ పొందే ఉద్యోగులు పెన్షన్, జీపీఎఫ్‌పై అవగాహన పెంపొందించుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహాశబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్ సమస్యలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పెన్షన్, జీపీఎఫ్‌పై ఖజానా శాఖ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి పూర్తి తెలుసుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, హైదరాబాద్ ఏజీ కార్యాలయ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ అనిల్ సానార్కర్, నరేశ్‌కుమార్ మాట్లాడుతూ పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం ఆదాలత్ నిర్వహించామని, తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్లు, జీపీఎఫ్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. వరంగల్, హనుమకొండ డీఆర్‌ఓలు వై.వి గణేశ్, విజయలక్ష్మి, హనుమకొండ జిల్లా డీటీఓ శ్రీనివాసకుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లాల డీడీఓలు, పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ మహిళా ఖైదీకి పోస్టుమార్టం



సుచరిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

నర్సంపేట రూరల్ : రిమాండ్ మహిళాఖైదీకి ఫోరెన్సిక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. నర్సంపేట సబ్ జైలు రిమాండ్ మహిళా ఖైదీ పెండ్యాల సుచరిత (36) ఈనెల 21న మృతి చెందిన విషయం విధితమే. తొలుత నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, టౌన్‌సీఐ రఘుపతిరెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం వరంగల్ కేఎంసీ ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేందర్, సిద్దిపేట మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ హెచ్ఓడీ శ్రీధరాచారి, కుత్బుల్లాపూర్ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ హెచ్ఓడీ వసంత నాయక్‌తోపాటు నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుచరిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎన్‌హెచ్163 పనులు పూర్తి చేయాలి

● కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన ఎంపీ కావ్య



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

హన్మకొండ చౌరస్తా: నేషనల్ హైవే 163 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో గడ్కరీని కావ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాలపట్నం రోడ్) లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరించినా కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్లు, స్టేషన్ ఘన్‌పూర్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్డు ఉన్నా జనగామ నుంచి ఈ గ్రామాల మధ్యలో లింక్ లేకపోవడం సమస్యగా మారిందన్నారు. నేరుగా ప్రధాన రహదారి పైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి..సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ కావ్య తెలిపారు.

గంజాయి రవాణాదారుడికి జైలు, జరిమానా

వరంగల్ లీగల్ : విద్యార్థులకు ఎండు గంజాయి విక్రయించడానికి యత్నించిన పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన నేరస్తుడు ఎస్.డి. ఇమ్రాన్‌పాషాకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. 2019, డిసెంబర్ 7న సాయంత్రం 7 గంటల సమయంలో కాజీపేట ఇండియన్ గ్యాస్ కంపెనీ వద్ద ఇద్దరు వ్యక్తులు చేతి సంతో ఉన్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. గమనించిన పోలీసులు వారిని పట్టుకుని సంచిని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించడంతో కాజీపేట తహసీల్దార్ సమక్షంలో విచారించారు. ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల గొల్లపల్లికి చెందిన గుడిపాటి రిత్విక్‌రెడ్డి, మరొకరు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఎస్.డి. ఇమ్రాన్‌పాషాగా నిర్ధారించారు. అనంతరం విచారించగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు గంజాయి విక్రయించడానికి యత్నించినట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు నిందితుల నుంచి 50 గ్రాముల చొప్పున మూడు ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడు ఎస్.డి ఇమ్రాన్ పాషాకు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. మరో నిందితుడు రిత్విక్‌రెడ్డి విచారణ సమయంలో మృతి చెందాడు. కేసును పోలీస్ అధికారులు సుధాకర్‌రెడ్డి, ఆర్.నరేందర్, డి.దేవేందర్ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి, కుమారస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ ఎ.సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

నకిలీ మద్యం తయారీ ముఠా అరెస్ట్

● రూ.5 లక్షల విలువైన నకిలీ మద్యం, 60 లీటర్ల స్పిరిట్, 2 కార్లు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్ : నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠాలోని ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.5 లక్షల విలువైన నకిలీ మద్యం, 60 లీటర్ల స్పిరిట్, 2 కార్లను స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఈ మేరకు టౌన్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా శాయంపేటకు చెందిన అల్లం రవీందర్ గతంలో మధ్యప్రదేశ్ నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి ఎక్కువకు విక్రయించేవాడు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఆశీష్ ఠాకూర్‌తో పరిచయం ఏర్పడింది. అతడు కూడా రవీందర్ మాదిరి దొంగ మద్యం విక్రయించేవాడు. ఈ క్రమంలో ఖమ్మంకు చెందిన ఆర్ఎంపీ షేక్.సాబీర్ పాషా..రవీందర్‌కు పరిచయం కాగా ఇద్దరు కలిసి అక్రమంగా డబ్బులు సంపాదించాలకున్నారు. దీంతో ఆశీష్ ఠాకూర్‌ను కలిసి రూ.2.50 లక్షలు అందజేసి నకిలీ మద్యం తయారీకి కావాల్సిన స్పిరిట్ తెప్పించారు. వారందరికి వరంగల్ పెరికవాడకు చెందిన ములుగు రాజు, రాంతేజ, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పెద్దకిష్టాపురానికి చెందిన ఒర్సు గోపాలకృష్ణ, జక్కుల రమేశ్ పరిచయమయ్యారు. ఆరుగురు కలిసి ఆశీష్ ఠాకూర్ పంపిన స్పిరిట్‌తో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో నకిలీ మద్యం తయారు చేశారు. దానిని ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ ప్రాంతాల్లో విక్రయించాలన్నారు. ఈ క్రమంలో గురువారం గోపాలకృష్ణ, రమేశ్, సాబీర్ పాషా రెండు కార్లలో వచ్చి మద్యం తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండగా పోలీసులు పట్టుకున్నారు. గోపాలకృష్ణ, సాబీర్ పాషా, రమేశ్, రవీందర్, రాజును అరెస్ట్ చేయగా రాంతేజ, ఆశీష్ ఠాకూర్ పరారీలో ఉన్నారని ఎస్పీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు.

బైక్, ఏటీఎం వ్యాన్ ఢీ..

● మత్స్యకారుడి దుర్మరణం
● తిర్లాపురం సమీపంలో ఘటన



సురేందర్ (ఫైల్)

గార్ల: బైక్, ఏటీఎం వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ మత్స్యకారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం గార్ల మండలం తిర్లాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గార్ల మండల కేంద్రంలోని బెస్తబజారుకు చెందిన **బాదం సురేందర్(48) మత్స్య** కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బైక్‌పై ఖమ్మం వెళ్లి చేపల వలలు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తిర్లాపురం గ్రామ సమీపంలో గార్ల నుంచి డోర్నకల్ వెళ్తున్న ఏటీఎం **వ్యాన్ ఎదురెదురుగా ఢీకొనడంతో** సురేందర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మత్స్య కార్మికుడు సురేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్య కార్మిక సంఘం గార్ల మండల అధ్యక్షుడు బాదం కుమారస్వామి డిమాండ్ చేశారు.